# పంచలింగాల గుడి

మండు వేసవిలో మధ్యాహ్నం మూడు గంటల వేళ.

"అమ్మా, కొంచెం మంచినీళ్ళిప్పిస్తారా ?"

ఈతాకుల చాపమీద నుంచి లేచి కుండలో నుంచి తీసి గ్లాసెడు మంచినీళ్ళిచ్చిందామె.

"మరికొంచెం కావాలా ?"

"చాలమ్మా, మండుటెండలో మంచుముక్క వేసినట్టు చల్లటి మంచినీళ్ళిచ్చారు. కడుపు చల్లబడ్డది. మనదేవూరు ?"

"అది ఊరే కాని వల్లకాడులాంటిది. మిన్నువిరిగి మీదపడినంత ఆపద వచ్చింది. అక్కడి నుంచి ఇద్దరు పిల్లలతో రాత్రిపూట బయలుదేరి ఇక్కడికి వచ్చాను. ఆ ఊరిపేరు మతుకుపల్లి."

"పిల్లలేం చేస్తున్నారు ?''

"దగ్గరలో ఉన్న గవర్నమెంటు స్కూల్లో రెండూ మూడూ క్లాసులు చదువుతున్నారు. పిల్లలు బాగా చదువుతున్నారని పంతులు జీతం కట్టనవసరంలేకుండా ఏర్పాటు చేశారు. పదవక్లాసువరకూ గవర్నమెంటు ఖర్చుమీదనే చదువుకోవచ్చన్నారు."

"రోడ్డు పక్కన కర్రలమీద గోనెపట్టాలేసుకుని ఉంటున్నారా ?" అంటూ లోపలికి తొంగిచూశాడు.

''ఆ రాళ్ళు అట్లా పెట్టావెందుకమ్మా ? రాత్రిపూట కాళ్ళకు తగలవూ ? పడుకున్నప్పుడు తలకు తగిలితే ఎంతప్రమాదం ?"

"ఏంచెయ్యను బాబూ, పిల్లలతో తలదాచుకోవాలికదా ? ఆ మూలకు ఒక

బొరియలా ఉంది లోతుగా, చుట్టుపక్కల నుంచి మన్ను రాలకుండా చుట్టూ రాళ్ళు ఏరుకొచ్చి పెట్టాను. రోడ్డు మలుపుతిరిగేచోట ఈ జాగా ఖాళీగా కనుపిస్తే, కర్రలు పాతి, గోనెపట్టా పురికొసతో కట్టాను. వానాకాలం వస్తే ఇబ్బందేమరి, మీరు ఎండలో వచ్చారు. కొంచెం విశ్రాంతి తీసుకోండి'' చాప ముందుకు జరిపింది.

నడవలేక నడిచి వచ్చిన ఆయన చాపమీద కూర్చుని లోపలంతా మరొక సారి కలయజూశాడు.

"గుండ్రటి రాళ్ళు పెట్టావు. ఎక్కడినుంచి ఏరుకొచ్చావు? రాత్రిళ్ళు భయంగా లేదూ?"

"ఇప్పుడు భయపడాల్సిందేమీ లేదు నాదగ్గర. ఇక్కడికి ఏడాది క్రిందట వచ్చినప్పుడు ఒక చిన్నమూట ఉండేది. దాన్ని చీరలోచుట్టి తలక్రింద పెట్టుకునే దాన్ని. రాత్రిపూట ఎవరోవచ్చి చీరెగుడ్డతోపాటు దాన్నికూడా తీసుకువెళ్ళారు."

"చిరకాలం జీవించమ్మా బిడ్డలతో, కష్టంలో ఉన్నట్టున్నావు. కాని కష్టాలు కలకాలం ఉండవు" అతడు లేచి వెళ్ళాడు.

దొంగతనమయిన తరువాత ఆమెకు ఉన్నభయం కూడా పోయింది. ఆమె దగ్గర ముంతలూ దాకలూ తప్ప ఏమీలేవు. పిల్లలకూ తనకూ ఒంటిమీద ఒక బట్ట, తాటిమీద ఒకబట్ట ఉంటాయి. ఏపూట కాపూట బియ్యంకొని వంటచేస్తుంది.

నిండా మునిగిన వాళ్ళకు చలేముంటుంది?

బస్సు ఆగేచోటే రేషన్‌సామాను కొట్టు ఉంది. ఆమె బియ్యం కొంగులో మూటకట్టుకుని బయటికి రాగానే పదిమంది యువతులు సిల్కుచీరెలు కట్టుకుని చేతులకు బేగ్‌లు తగిలించుకుని నిలబడి "టైమయిపోతోంది. ఇంకా బస్సురాలేదు" విసుక్కుంటున్నారు.

"ఇవాళ నేను చపాతీకూడా తినిరాలేదు."

"కేంటీన్‌లో తిను."

"రోజూ అంత డబ్బు ఖర్చుచెయ్యలేక......."

''కొంచెం తొందరగా లేస్తే?"

"పాప రాత్రిళ్లు సరిగా నిద్రపోదు.''

"నీవు ఇలావస్తే ఇంట్లో ఎవరు ?"

"అమ్మ ఉంది, ఆమెకు నేను తప్ప ఎవరూలేరు."

అంతలో అంకమ్మ వాళ్ళకంట బడ్డది.

"ఇదిగో, ఇట్లాంటి మనిషి రొట్టెలు చేసిఇస్తే, మనమంతా కొనుక్కుని డబ్బాలో పెట్టుకుని ఆఫీసుకు వెళ్ళొచ్చు" ఆమెను చూస్తూ వాళ్ళల్లోవాళ్లు అనుకుంటున్నారు.

''డబ్బిచ్చినా రోజూ చేసిపెట్టద్దూ.''

అలా ప్రతిరోజూ ఆమె వాళ్ళకు బజారుకు వస్తూపోతూ కనబడుతునేఉంది బియ్యం కొంగులో పోయించుకుని. వాళ్లు ఆశతో ఆమెను చూస్తూ వాళ్ళల్లోవాళ్లు మాట్లాడుకుంటూ నిలబడతారు బస్సుకోసం.

"నీవేంపని చేస్తావు" వాళ్ళలో ఒకరడిగారు అంకమ్మను.

"ఆ సేటుకు బియ్యం, పప్పులూ బాగుచేసిపెడతాను. నాకు పూటకు డబ్బయినా బియ్యపు నూకలయినా ఇస్తాడు. అవే వండి, పిల్లలకు పెట్టి నేను తింటాను.''

"మాకు రోజూ చపాతీలు చేసిపెట్టకూడదూ? మేము నీవడిగిన డబ్బిస్తాము."

"నాకు అలవాటులేదు రొట్టెలు చెయ్యటం. మీరు ఒకరోజు చూపిస్తే చేసిపెడతాను.''

''సాయంత్రము ఇంటికి పోయేటప్పుడు వస్తాము. నీ ఇల్లెక్కడ ?"

''ఆరోడ్డు మలుపు తిరిగేచోట గోనెపట్టా కట్టిఉన్నదే నేనుండేది."

వాళ్లు బస్సు ఎక్కగానే అంకమ్మ ఇంటికి వచ్చింది. ఆమె కొంగులోపోసుకుని తెచ్చినవి సగం బియ్యం కలిసిన నూకలు. గాలించి పొయ్యిమీద పెట్టింది. మధ్యాహ్ననికి ముంతెడు రాగిగంజిచేసి మూతపెట్టింది. పిల్లలిద్దరూ వీధిపంపు దగ్గర స్నానాలుచేసి వచ్చారు. వాళ్ళకు చింతకాయపచ్చడితో అన్నంపెట్టి స్కూలుకు పంపించింది.

ఆ సమీపంలో ఉన్న చింతచెట్టు ఏడాదిపొడుగునా ఆమెను ఆదుకుంటోంది. చింతకాయరోజుల్లో చింతకాయలూ ఎండాకాలంలో చింతచిగురూ ఎండిన పుల్లలూ పిల్లలు చెట్టెక్కి కోస్తారు

కాలం గడిచిపోతున్నది.

అంకమ్మ కాయకష్టంచేసిన మనిషే. కాని, ఈ ఊరు రాకముందు తనదైన ఇంట్లో ఉంటూ తృప్తిగా కష్టపడి పండించుకున్న గింజలతో, కడుపులునింపుకునేవారు. తాళికట్టిన మనిషి మనసున్నవాడు. ఇద్దరు కన్నబిడ్డలతో కలకల నవ్వుతూ బతికింది స్వంత ఇంట్లో.

తాతలనాటిదే అయినా ఆ చిన్న పెంకుటింట్లో ఎన్నో శుభకార్యాలు జరిగాయి. ఎన్నో జంటలు సుందరస్వప్నాలతో, సుఖశాంతులతో బతికాయి.

సరిగ్గా ఏడాది క్రిందట, ఉదయం ఎనిమిది గంటలవేళ మధ్య మధ్య కళ్లు ఒత్తుకుంటూ ఇద్దరుపిల్లలతో బస్సు దిగింది అంకమ్మ. చేతిలో చిన్నమూట, పొలం పనులు చేసుకునేటప్పుడు వేసుకునే కిర్రుచెప్పులతో.

పిల్లలు పదోఏడు వచ్చిన పిల్లవాడొకడు, ఏడేళ్లు వెళ్ళిన పిల్లవాడొకడు. మాసికలు వేసిన నిక్కర్లు వేసుకుని, తెగిన చెప్పులు ఈడ్చుకుంటూ తల్లి వెంట అడుగులు వేస్తున్నారు.

కొత్తఊరు, ఎక్కడికి వెళ్ళాలి? తన గమ్యం ఎటు? ఆమె ఆలోచిస్తోంది.

కొంతదూరం నడిచిన తరువాత జనసమ్మర్దం గల పట్టణంలో వీధిమలుపు తిరిగేచోట పది పదిహేను గజాల ఖాళీస్థలం కనబడ్డది. దాన్ని చూడగానే ఆమెకు ప్రాణం లేచివచ్చింది.

"ఇక్కడ కూర్చుందాం రండి" అంటూ పిల్లలిద్దరినీ చెరొకవక్కన కుర్చోబెట్టుకుంది. మూటలోనుంచి బాదమాకులు తీసి పిల్లల చేతుల్లో పెట్టింది. ముంతలో పెట్టుకొచ్చిన పెరుగన్నం ముద్దలు చేసి ఇద్దరి చేతుల్లోపెట్టి ఆవకాయముక్క నంజుకోవటానికి పైన ఉంచింది.

రాత్రి చిక్కటిపాలల్లో అన్నం ఉప్పుకల్లువేసి తోడుబెట్టినది తినగానే పిల్లలు 'ఇంక చాలు' అంటూ మంచినీళ్ళు కావాలన్నారు.

అంకమ్మ లేచి ఇటూ అటూ చూసింది. "అదిగో, అక్కడ జనం మూగిన చోట నీళ్ళపంపు ఉన్నది సత్యం, నీవు మంచినీళ్లు తాగి అన్నయ్యకు తీసుకురా. వాడికి కాలునొప్పిచేసింది" మూటలోనుంచి గ్లాసుతీసి యిచ్చింది.

సత్యం వెనక్కు తిరిగిచూస్తూ ముందడుగువేస్తూ అక్కడికి చేరుకున్నాడు. బిందె తరువాత బిందెపడుతూ, మధ్య మధ్య గట్టిగా పక్కవాళ్ళను అదరిస్తూఉన్న వాళ్ళ మధ్య దూరలేక, గ్లాసెడు మంచినీళ్ళు కావాలని వాళ్లనే అడిగాడు. ఒకామె ఒక గ్లాసెడు నీళ్లు పట్టిఇచ్చింది. తను తాగి మరొకగ్లాసు అన్న కోసం తీసుకు వచ్చాడు.

రామూ కాలికి బస్సులో దెబ్బతగిలింది. కాలు సలుపుతోంది. పెరుగన్నం తిని మంచినీళ్ళు తాగంగానే "అట్లావెళ్ళి గోడకు దగ్గరగా నీడన కూర్చోండి" అని తల్లి అన్నదే తడవుగా రాత్రికప్పుకున్న దుప్పటి పరచుకున్నారు. పెరుగన్నం తిన్న మత్తులో నిద్రకొరిగారు.

"పిచ్చిసన్నాసులు, నిద్రపోయారు కడుపునిండంగానే. వీళ్ళిద్దరినీ ఎట్లా పెంచను?"

ఆమెకు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"జీవితంలో రేపటిరోజు నీదికాదు" అన్నట్టుగానే జరిగిందామెకు.

ఇద్దరి మోతుబరి రైతులమధ్య రెండెకరాల భూమీ, ఒకచిన్న పెంకుటిల్లూ పిత్రీయంగా లభించాయి సుబ్బయ్యకు. నాలుగు సంవత్సరాలలో అటు ఆ రైతూ, ఇటు ఈ రైతూ గుర్తుగా పాతిన రాళ్ళను జరిపి జరిపి, ఒక ఎకరం చేశారు. సుబ్బయ్య అడిగినప్పుడల్లా వాళ్ళిద్దరు దబాయించి మాట్లాడేవారు.

"దొరక్క దొరక్క నీ పొలమే దొరికిందా మాకు ఆక్రమించుకోటానికి ? మాకు ఒక్కొక్కళ్ళకు పాతికెకరాల సుక్షేత్రమైన భూమి ఉంది. కావాలంటే పంచాయితీ పెట్టిస్తాము. నలుగురూ ఏమంటారో విను. ఇంక నోరు మెదిపావో, ఆకాస్త భూమి కూడా మాదేననిపించగలం జాగ్రత్త'' బెదిరించారు.

వాళ్ళకా పాతికెకరాలు ఎలా సంక్రమించాయో సుబ్బయ్యకు బాగాతెలుసు. ఆ సంగతి నలుగురి నోళ్ళల్లో పడి కోర్టువరకూ పోయింది. కోర్టుకు చెవులేగాని

కళ్లు లేవుకదా. వీళ్ళిద్దరి పక్షాన న్యాయమున్నదని సాక్ష్యాధారాలతో రుజువయింది. చాలామంది వాళ్ళిద్దరి కుతంత్రాలకూ, దౌర్జన్యాలకూ భయపడి నోళ్లు మూసుకున్నారు. ఆ ఊరి దేవాలయానికి ఎప్పుడో జమీందారులు, మాన్యంగా రాసిచ్చిన భూములని ఆ సంగతి ఊరందరికీ తెలుసు.

అటువంటివాళ్ళదగ్గర సుబ్బయ్య ఈ సంగతి ఎత్తగలడా? నోరెత్తితే ఈ లోకంలో లేకుండాచేస్తారు.

కోతలయిన తరువాత సుబ్బయ్య ఎరువులువేసి దున్నుకున్నాడు. ఒక వర్షంపడితే కొత్తరకం వరి వెయ్యాలనుకున్నాడు. అప్పటినుంచీ పొలంగట్టుమీదనే పడుకుంటున్నాడు. ఒక రాత్రివేళ ఎవరో సరిహద్దు రాళ్లు ఊడబెరికి జరిపి పాతుతున్నట్టు అలికిడయింది.

"ఎవడ్రావాడు?" కేకబెట్టాడు సుబ్బయ్య.

అతడి కేకలకు వాళ్ళపని ఆగలేదు. అంతా అయిపోయింది. సుబ్బయ్య లేచి, వాళ్ళను సమీపించి గుర్తుపట్టాడు.

"ఇట్లా జరిపిజరిపి నాకు చేరెడుభూమయినా మిగిల్చేటట్టులేరు మీ ఆసాములు" వాళ్ళ చేతిలోనుంచి గునపం లాక్కున్నాడు సుబ్బయ్య.

కొంత పెనగులాట అయిన తరువాత సుబ్బయ్య చేతిలోఉన్న గునపము వాళ్ళచేతికి చిక్కింది. దానితోనే సుబ్బయ్య తలపైనమోది ఇద్దరూ పరారయ్యారు.

పొద్దున్నేలేచి వీధి వాకిలి ఊడుస్తున్న అంకమ్మకు ఎవరో ఈ కబురు చేరవేశారు. ఆమె ఏడుస్తూ పరుగెత్తుకుంటూ వెళ్ళేసరికి, నేలంతా రక్తంతో తడిసిపోయింది. సుబ్బయ్య కొనఊపిరితోఉన్నాడు. అంకమ్మఏడుస్తూ నలుగురినిపిలిచి, వాళ్ళ సహాయంతో హాస్పిటల్లో చేర్పించింది. డాక్టర్ల కాళ్లుపట్టుకుని ఏడ్చింది. తన గోడంతా చెప్పుకుంది. డాక్టర్లు తలకు కుట్లువేశారు.

సుబ్బయ్య మెల్లగా కళ్లుతెరచి "నీవు ఈ ఊరినుంచి వెళ్ళిపో, పిల్లలనూ నిన్నూ వాళ్ళు బతకనివ్వరు. ఆ యిల్లూ వడ్లూ రత్తయ్యకు ఎంతకో అంతకు అమ్మి వెళ్ళిపో" చెప్పలేక చెప్పలేక తడబడుతూచెప్పి కళ్ళుమూసాడు.

అంకమ్మకు మిగిలింది ఏడుపే. సుబ్బయ్యకు తెలిసినవాళ్ళ సహాయంతో దహనక్రియలు చేయించింది. రత్తయ్యకు ఇల్లూ వడ్లూ బేరంపెట్టింది.

సుబ్బయ్యతో కలిసిమెలిసి తిగిరినవాడే రత్తయ్య. మొదటినుంచీ సుబ్బయ్య పడ్డకష్టాలన్నీ అతడికి తెలుసు. సుబ్బయ్యకు మొదటినుంచీ ఆ పెద్ద ఆసాములు చెరొకపక్క చేరి ఎంతనష్టంకలిగించారో రత్తయ్య కళ్ళతో చూసినవాడే. కాని-సుబ్బయ్య చనిపోగానే అతడి మనసు మారిపోయింది.

"అమ్మాయీ నీ వెంతకష్టంలోఉన్నావో నేను కళ్ళారాచూస్తున్నాను. నీవు ఒంటరిదానవయ్యావు. సుబ్బయ్య చెప్పినట్టు ఇల్లూ వడ్లూ అమ్మతానంటున్నావు కదా. ఇంటికింద ఎనిమిదివేలువస్తాయి. అంతకంటె ఎక్కువచెయ్యదు. అంతా పడిపోతున్నది. నీవు కష్టంలోఉన్నావని అదయినా ఇస్తున్నాను. మరొకడయితే ఐదో ఆరో చేతిలోపెట్టాడు, ధాన్యం బజారురేటుకు తీసుకుంటాను. అవి ఏడువందలు నా పేరుమీద ఇల్లు రాసివ్వు నీకు డబ్బిస్తాను. నాబండిలో నిన్నూ పిల్లలనూ రైలు స్టేషనుకు పంపిస్తాను" అన్నాడు. ఆమె బయలుదేరేటప్పుడు "నీ కింత కష్టము వస్తుందని కలలోకూడా అనుకోలేదమ్మా. నా గుండె పగిలిపోతున్నది. ఆ కాస్త పొలం ఊరి పెద్దలతో ఆలోచించి అమ్మి డబ్బు నీకు చేరుస్తాను. నీవు ఎక్కడికి వెళ్ళినా నాకు ఉత్తరం రాస్తూఉండు" అని కళ్ళు ఒత్తుకున్నాడు.

అంకమ్మకు ఆ మాటలలోని మాయామర్మాలు తెలుసు కాని తానిప్పుడు నిస్సహాయురాలు. ఆ ఊరికోదణ్ణంపెట్టి బండెక్కింది. నాలుగుగంటల రైలు ప్రయాణం తరువాత బస్సులో కొంతదూరంపోవాలి. ఆ చీకట్లో బస్సు ఎక్కేటప్పుడు పిల్లవాడికాలికి దెబ్బతగిలింది. చివరకు ఆ ఊరు చేరుకుంది.

తనున్నచోటికి రెండు ఫర్లాంగుల దూరంలో ఒక ప్రభుత్వ పాఠశాల ఉన్నది. పిల్లలతోవెళ్ళి హెడ్‌మాస్టరు కాళ్ళుపట్టుకుని, తన గోడంతా చెప్పుకుని ఏడ్చింది. నూటికొకరన్నట్టు ఆయన మనసుకరిగి పిల్లలను స్కూల్లో చేర్చుకున్నారు.

"అయ్యగారూ నాకుకూడా మీదగ్గర పనేదయినా ఇప్పించండి" ప్రాధేయపడ్డది.

"ప్రస్తుతం ఖాళీలులేవు ఊడ్చేమనిషి సెలవుమీదఉన్నది. నెలకు ఏభయి రూపాయలు. వచ్చేనెలనుంచీ వస్తుంది. అంతవరకూచేసి ఈలోపల ఎక్కడైనా చూసుకోవాలి. పది రోజులపని" అన్నాడు.

ఈ విధంగా కొన్ని రోజులు గడిచాయి.

సాయంత్రం ఐదుగంటలుకాగానే బస్సులో ఉద్యోగినులు దిగారు సిల్కు చీరెలు కట్టుకుని బుజాలకు తగిలించుకున్న బేగులతో.

"మీ పని చెయ్యటానికి నేను సిద్ధంగాఉన్నాను కాని-నాదగ్గర రొట్టెలు కాల్చటానికి పెనంపిండిలేవు" అన్నది అంకమ్మ.

"కావలసిన వస్తువులన్నీ మేము కొనిస్తాం. ఏంకావాలోచెప్పు" కాగితమ్మీద ఆమె చెప్పినవస్తువులు రాసుకున్నారు. గంటలో తెచ్చిపడేశారు.

"కట్టెలు నేను తెప్పించుకుంటాను. మీరువచ్చేసరికి రొట్టెలు చేసిఉంచుతాను. రొట్టెలలోకి ఏంచెయ్యాలి?"

"మేము కూరగాయలు తెచ్చియిస్తాము కూరచెయ్యి. చేసిపెట్టినందుకు నీకేమివ్వాలి?"

అంకమ్మకు బుగ్గలమీదుగా కన్నీళ్ళు జారాయి.

"నీవు బాధపడకు మేము ఐదుగురం ఉన్నాము. ఐదురూపాయలు చేసినందుకు ఇస్తాం" ఆమెను ఓదార్చారు.

"నేను ఇంతోఅంతో కలిగినఇంట్లోపుట్టాను. మనసే కలిమిగాగల మనిషితో బతికాను. గతిలేక ఈ ఊరొచ్చాను. నాకు ఈ పనికొత్త. నేను ఇంకాఏమేమిపనులు చేసి ఈ బిడ్డలను పెంచాలో?" ఏడ్చింది అంకమ్మ.

"మాకూ బాధగానేఉంది మాకుచేసిపెట్టమని అడిగినందుకు. కాని, నీవు ఇల్లుకదలకుండా కొంతయినా సంపాదించవచ్చుకదా. నీకుడబ్బవసరంఉన్నట్టుగా మాకు తోచింది. నీకు డబ్బవసరమయితే మాకు చేసిపెట్టటానికి ఎవరయినాకావాలి. దీనిలో తప్పేముంది? మన అవసరాలు తీర్తాయికదా?''

ఆమె కళ్ళు తుడుచుకుని వాళ్ళందరినీ తలఎత్తిచూసింది. "చేసిపెట్టటానికి కాదు నాబాధ. నా కెటువంటిపరిస్థితి వచ్చిపడ్డదీఅని నాకు ఏమడగాలోకూడ తెలియదు. మీరేమిచ్చినాసరే" అంకమ్మకు సుబ్బయ్య ఆఖరినిమిషంలో "పిల్లలను తీసుకుని ఎక్కడికయినాపోయి బతుకు" అన్నమాటలు జ్ఞాపకానికివచ్చాయి.

"ఇదివరకూ ఐదుగురమని అనుకున్నాము. కాని-మాతోఇంకో అయిదుగురు కలుస్తామన్నారు. రేపటినుంచీ రొట్టెలు తయారుచెయ్యి. నీకు ఒక స్టౌకూడా కొనిస్తాము. ఈ నెలకు మేమిచ్చిందితీసుకో. చాలకపోతే అడుగు. మనిషికి మూడు రొట్టెలూ కూర కావాలి. సరుకులు నెలకు ఒక్కసారేతెచ్చి ఇవ్వమన్నావా? లేక వారానికొకసారి తెమ్మన్నావా?" వాళ్లలో ఒకరు ముందుకొచ్చి అడిగారు.

"నెలకొకసారేవద్దమ్మా. ఇక్కడ చోటులేదు వారానికి సరిపడ్డ సరుకులు తీసుకురండి''

వాళ్లను రోడ్డుమీదివరకూ సాగనంపి ఆకాశంవైపుచూస్తూ చేతులుపైకెత్తి దణ్ణంపెట్టింది.

ఆ మరునాటినుంచీ వాళ్లకు ఎనిమిదిగంటల వేళకే రొట్టెలుకూరా తయారు చేసి ఉంచేది. వాళ్ళు తెచ్చుకున్నడబ్బాలలో సర్దిపెట్టేది.

నాలుగునెలలు గడిచినతరువాత పిల్లలకూ తనకూ బట్టలు కొనగలిగింది.

ఆమెకు కూరకొక స్టౌ రొట్టెలుచెయ్యటానికి ఒక స్టౌ అవసరం అనుకుని ఉద్యోగినులందరూకలసి మరొకస్టౌ కిరసనాయిల్‌డబ్బా కొనుకొచ్చారు. అంకమ్మ పని తొందరగా పూర్తిచేసుకోవటంవల్ల మధ్యాహ్నం కొంత తీరిక లభించేది.

ఒకనాడు ఆమె పిల్లలను స్కూలుకుపంపించి తలారాస్నానంచేసి వాకిట్లో కూర్చుంది.

ఆ పదిగంటలవేళప్పుడు ఐదారుగురు స్త్రీలు కొబ్బరికాయలూ అరటిపండ్లూ చలిమిడి పళ్లేలలో పెట్టుకుని ఆదారినపోతూ అంకమ్మకు కనబడ్డారు.

"మేము ఆకనబడే బ్లాక్సులో ఉంటాము. కొత్తగా ఈఊరువచ్చాము. ఈ చుట్టుపక్కల పుట్టఎక్కడైనాఉందా?'' అడిగారు.

"నాకు బాగా తెలియదమ్మా. నేనూ ఈఊరికి కొత్తగా వచ్చాను.''

అంతలో వాళ్లల్లో ఒకరు లోపలికి తొంగిచూశారు. "ఈ గోనెపట్టా కట్టా రెందుకు?'' అడిగింది.

"నాకు ఇల్లులేదమ్మా. ఇక్కడ కాస్తజాగా మూలగా ఉందని కర్రమీద

గోనెపట్టా కట్టాను. ఇక్కడే మా పిల్లలూ నేను వండుకుని తింటాము. దీనిలోనే పడుకుంటాము.''

అంతలో ఒకరి తరువాత ఒకరు లోపలికి వచ్చారు. ఇటూ అటూ చూసి "ఇదిగో ఇక్కడ పుట్టలాగే ఉంది. చుట్టూ శివలింగాలుకూడా ఉన్నాయి. అందరం ఇక్కడే ఈ పుట్టలో పాలుపోసి పూజచేసుకుందాము" అనుకున్నారు. ఒకరు నీళ్లు చల్లిచేత్తో అక్కడంతా శుభ్రంచేశారు. మరొకరు ముగ్గులేసి పసుపు కుంకుమ చల్లారు. బొరియమీద నీళ్ళుచల్లారు. చుట్టూఉన్న రాళ్ళను నీళ్ళతోకడిగి బొట్టు పెట్టారు. బొరియమీద నూకలు చల్లారు. పాలుపోసి అరటిపండు ముక్కలు దానిలో వేశారు. కొబ్బరికాయలు కొట్టి, పుట్ట దగ్గర చిల్లర డబ్బు పెట్టారు. వెళ్ళే టప్పుడు ఆమెకు ప్రసాదంఇచ్చి వెళ్ళారు. వాళ్ళకు పెన్నిధి దొరికినట్టుగా ఉంది.

అంకమ్మ బొమ్మలా నిలబడి చూస్తోంది.

అందరూ పుట్టకూ రాళ్ళకూ నమస్కారం చేసినట్టుగా ఆమెక్కూడా చేసి వెళ్ళారు.

అంకమ్మ ఆలోచనలో పడ్డది. ఈ రాళ్ళన్నీ తను ఏరుకుని తెచ్చి పెట్టినవే. ఇదివరలో అందరూ పూజలుచేసుకుని ఇక్కడ పాలుపోసేవారేమో? ఆ బొరియ పుట్టకాదుకదా? అది పందికొక్కుల బొరియ అనుకుంది తను. తనున్న ఊరు చిన్నగ్రామం. అక్కడ ఇటువంటి పూజలు తను చూడలేదు.

అది మొదలుకొని దారినపోయే జనం అక్కడ ఆగి, దణ్ణాలుపెట్టి చిల్లర డబ్బులు వేసిపోతున్నారు. కొందరు కొబ్బరికాయలుకొట్టి సగం సగం ముక్కలు అక్కడే వదిలిపెట్టి వెళ్ళుతున్నారు. రానురాను వచ్చిపోయేజనం ఎక్కువయ్యారు.

అంకమ్మకు తనక్కడ ఉండకూడదేమో ననిపించింది. అందరూ అలా వచ్చిపోతూ ఉంటే తనకు వంటకూ, భోజనాలకూ చోటుండటంలేదు. తనకు మరొకస్థావరమెక్కడ దొరుకుతుంది? అద్దెకు తీసుకునిఉండే స్తోమత తనకు లేదు

ఆమె ఆగోనెపట్టాకే మరొకటిచేర్చి పందిరిని మరికాస్త వెడల్పు చేసింది. ఒక పక్కగా వంటచేసుకుని భోజనాలు కాగానే కుండలుకడిగి బోర్లావేసేది. స్టౌల మీద ఒక పాతబట్ట కప్పిఉంచేది.

ఆమె మామూలుగా తెల్లవారుఝామున జనం తిరగనివేళ లేచి, స్నానం చేసి విభూతి ముఖాన రాసుకుని తనపనులు పొద్దుపొడిచేవేళకు చేసుకునేది. ఈ మధ్య రొట్టెలపని అధికమయింది కనుక ఆ పనికూడా వేగంగా చేయగలుగు తోంది.

ఈ కొత్త సంఘటనతో ఆమెకు భోజనానికి ప్రతిరోజూ ఆలస్యమవు తున్నది.

ఒక రోజున పొద్దుపొడుస్తుండగా ఒకాయన లోపలికి వచ్చాడు.

అంకమ్మ పనిచేసుకుంటోంది. 'ఎవరూ' తలతిప్పి చూసింది.

"ఇక్కడికి వచ్చి దణ్ణంపెట్టుకుంటే అనుకున్నపని అవుతుందని అందరూ అనుకుంటుంటే వచ్చాను" అనుకుంటూ రాళ్లదగ్గర సాగిలపడి లేచి చెంపలువేసు కున్నాడు.

"ఏమమ్మా ? ఈ శివలింగాలను ఇట్లా వదిలిపెట్టావెందుకని ? పదిమందినీ చందాలడిగి తాటాకుల పందిరయినా వేయించు" అన్నాడు ఊదువత్తివెలిగిస్తూ.

"అయ్యా, నేను కొత్తగా వచ్చాను. నాకు తెలిసిన వాళ్ళెవరూ లేరు. నేనెవ రిని అడగను ?" చేతులు జోడించింది.

ఆయన బైటికి వచ్చేసరికి మరోనలుగురు అక్కడ నిలబడి ఉన్నారు.

వాళ్లను చూసి ఆయన "అందరూ తలాకాస్తా వేసుకుని ఈ పంచలింగాలకు పందిరయినా వేయిద్దాం. చూస్తూ ఊరుకోకూడదు" అన్నాడు.

పదిరోజుల లోపల తడకలూ, బొంగులూ తెచ్చి మూడు పక్కలా అడ్డం కట్టి పైన తాటాకులతో కప్పించాడు. ముందువైపున దారి వదిలిపెట్టి అక్కడ కూడా తడక కట్టించాడు. లోపల చీకటిగా ఉన్నా మరుగుఏర్పడ్డది.

"ఇక్కడ ప్రతిరోజూ అలికి ముగ్గుపెట్టు" అని చెప్పి వెళ్ళాడాయన.

క్రమంగా అది పీధిగుడిగా మారింది. వచ్చిపోయే జనంతో కిటకిటలాడు తోంది. రిక్షావాళ్ళు, కూరలూ పళ్ళు అమ్ముకునేవాళ్ళూ వ్యాపారం బాగాసాగాలని ముందుగా ఇక్కడికి వచ్చి దణ్ణంపెట్టుకునేవారు. ఇళ్ళకు వెళ్ళేముందు కొన్ని

చిల్లర డబ్బులు అక్కడ ఉంచేవారు. పళ్ళమ్ముకునేవాళ్ళు రెండు పళ్ళు పెట్టి పోయేవారు.

పల్లెలో పుట్టిన అంకమ్మకు ఇదంతా వింతగా కనబడినా కళ్ళతో చూస్తూ ఉండేది. అందరూ పెట్టిన పళ్ళనూ చిల్లరదబ్బులనూ ఒక పక్క పెట్టి అలికి ముగ్గు వేసేది.

ఒకనాడెవరో అన్నారు- "ఆ పళ్ళూ పైసలూ తీసుకోమ్మా, ఆ ప్రసాదాన్ని అట్లా వదలిపెట్టకూడదు."

స్కూలునుంచి పిల్లలు రాగానే కొబ్బరి ముక్కలు పళ్ళు తినేవారు.

అట్లా అమాయకంగా ఉండే అంకమ్మ "తను ఏరుకొచ్చినరాళ్లే దేవుళ్ళని నమ్మి ఇంతమంది వచ్చిపోతున్నారు. నిజంగా రాళ్ళు దేవుళ్ళు కాకపోతే ఇంత మంది ఎందుకువస్తారు? ఇంక ఇక్కడినుంచి తనను వెళ్ళిపొమ్మంటారేమో ? అప్పుడు తన గతి ?" మనిషి వచ్చినప్పుడల్లా గజగజలాడేది.

ఉన్నట్టుండి ఒకనాడు పదిమంది కూలీలు పారలూ తట్టలూ గునపాలూ తీసుకువచ్చి ''ఇదంతా తవ్వి రోడ్డు వెయ్యాలటమ్మా" అన్నారు.

"రోడ్డు ఎవరువేస్తున్నారు ?'' భయపడుతూ అడిగింది.

"మ్యునిసిపాలిటీవారు"

"వాళ్ళను పిలుచుకురండి" అన్నది ధైర్యం తెచ్చుకుని.

మేస్త్రీవచ్చాడు. "ఇది మట్టిరోడ్డుకదా. కంకరరోడ్డు వెయ్యాలని సూపర్ వైజరు చెప్పాడు. కూలీలు తవ్వటానికి వచ్చారు" అన్నాడు.

అంకమ్మ లోపల భయపడుతూనే పైకి గంభీరంగా ''చూస్తున్నారా- ఎంతమంది ఇక్కడికివచ్చి పూజలుచేసుకుంటున్నారో? పంచలింగాలిక్కడ వెలి శాయని కొబ్బరికాయలు కొడుతున్నారు. ఈ సంగతి ప్రజలందరికీ తెలుసు. దారినపోయేవాళ్ళుకూడా వచ్చి దణ్ణాలు పెట్టుకుంటున్నారు. మొక్కుబడులు తీర్చు కుంటున్నారు. ఇది ప్రజలగుడి. తవ్వటానికి వీలులేదు'' అన్నది ముందుకడుగు వేసి.

ఈ సంగతి అంచెలమీద సూపర్‌వైజరుకు తెలిసింది. అతడు వచ్చి లోపల అంతా పరీక్షగా చూశాడు. కర్పూరం ఊదువత్తులూ వాసనలు వెదజల్లుతున్నాయి లోపల. రాళ్ళదగ్గర పూలు అక్షతలూ కనబడ్డాయి. నైవేద్యం పెట్టిన పళ్ళూ కొబ్బరి కాయలూ ఎదురుగాఉన్నాయి. ఒకక్షణం ఆగి బయటికి వచ్చాడు 'ఇంతమంది పూజలు చేసిన స్థలమిది. బాగా ఆలోచించాలి.' అనుకుని మళ్ళీ ఒకసారి లోపలికి వెళ్ళి ఆ రాళ్లవైపొకసారిచూసి దణ్ణంపెట్టి అక్కడి కుంకుమతీసి నొసటన బొట్టు పెట్టుకున్నాడు.

"పదండిరా పోదాం" అంటూ దారితీశాడు.

ఈ వార్త ఇంజనీయరు వరకూ వెళ్లింది. ఆయన వచ్చి స్వయంగాచూసి దీనినంతా తవ్వి రోడ్డువేస్తే 'తనకళ్ళే పోతాయో లేక వంశమే నాశనమవుతుందో' నన్న భయం పుట్టింది.

"ఆచోటు వదలిపెట్టి ఇవతలగా తవ్వండి" అని చెప్పి వెళ్లిపోయాడు.

అంకమ్మకు ఏంజరుగుతుందోనన్న ఆందోళన ఎక్కువయింది. వాకిలి ముందు తలమీద చేతులుపెట్టుకుని కూర్చున్నదల్లా లేచి, లోపలికి వెళ్ళింది. ఎప్పుడు వచ్చాడో ఒకాయన వచ్చి చేతులు జోడించి కళ్లుమూసుకుని ధ్యానంలో ఉన్నాడు.

"అయ్యా ఇది పదిమంది వచ్చి పూజచేసుకునే పవిత్రమైన స్థలము. ఇదంతా తవ్వి రోడ్డువేస్తామని మునిసిపాలిటివారు వస్తున్నారు. మీరు దీనిని ఎట్లాగయినా వాళ్ళనుంచి రక్షించాలి" అని ప్రాధేయపడ్డది.

ఆయన ఒక కంట్రాక్టరు. తెల్లటిబట్టలు వేసుకుని కాళ్లకు ఖరీదుగల చెప్పులు వేసుకుని వచ్చాడు. ముఖాన విభూతి దానిపైన కుంకుమబొట్టు పెట్టుకున్నాడు. ఆయన భక్తుడిలా కనబడ్డాడామెకు.

"ఇక్కడ పంచలింగాలు వెలిశాయని అందరూ చెప్పుకుంటున్నారు. నేను ఇంతదగ్గర్లోఉన్నా నాకీసంగతి తెలియలేదు ఇవాళ తెలియగానే చూడాలని వచ్చాను. దీనిని వృద్ధిలోకి తీసుకురావాలిగాని నాశనం చెయ్యకూడదు. నేనూ ప్రయత్నిస్తాను'' అన్నాడు.

మరునాడాయన పంచలింగాలు వెలిసినచోట గుడి కట్టించాలని ఆ చుట్టు పక్కల వాళ్ళందరిచేత సంతకాలు పెట్టించి ప్రభుత్వానికి ఒక దరఖాస్తు పెట్టించాడు. దరఖాస్తు కాపీ ఒకటి దేవాదాయ శాఖాధికారికి స్వయంగా వెళ్ళి చేతికిచ్చాడు.

నెలలోపల అధికారులు చూడటానికి వచ్చారు. అంకమ్మ తనగోడంతా చెప్పుకుని ముందువైపు గుడికట్టి వెనకవైపు తను ఉండటానికి చిన్నగదులు రెండు వేయించి ఇవ్వమని అడిగింది. ఆ గుడి బాధ్యతంతా తాను తీసుకుంటానని చెప్పింది.

అది వీధి గుడి. నియమం నిష్ఠ అవసరంలేదు. ఎవరయినావచ్చి స్వయంగా పూజలు చేసుకోవచ్చు. చేయించుకోవచ్చు. కనుక ప్రభుత్వంవారే పంచలింగాలు అందరికీ కనబడేటట్టు గ్రిల్సుతో తలుపులు చేయించి గుడి కట్టించారు. అభిషేకాలకూ అర్చనకూ తగిన వసతులు కల్పించారు. ప్రదక్షిణాలకు గర్భగుడిచుట్టూ గజమున్నర స్థలం వదలిపెట్టి ప్రాకారం కట్టారు తలుపుకెదురుగా ధ్వజస్తంభం ఎత్తారు. గర్భగుడికెదురుగా పెద్దగంట అమర్చారు. ఈ గుడి వెనకాల అంకమ్మ కోరినట్టుగా రెండుగదులు నీళ్ళగది వసతులూ విద్యుద్దీపాలు పంపుల సౌకర్యం కలిగించారు.

అప్పటినుంచీ అంకమ్మ గుడిలోపలి భాగమంతా శుభ్రంచేస్తున్నది. బయట వాకిలి కడిగి ముగ్గులు పెడుతున్నది. ఎనిమిదిగంటలు కాకుండానే గుడితలుపులు తెరిచిపెట్టి నూనెదీపం వెలిగించి రెండుపువ్వులు పంచలింగాలముందర పెడుతున్నది తనపని పూర్తిచేసుకుని వచ్చి, గుడిముందర చిన్నపీట వేసుకుని కూర్చుంటుంది భక్తులువచ్చి ఎప్పటిమాదిరిగా దణ్ణాలు పెట్టుకుంటున్నారు. కొందరు కొబ్బరికాయలు కొడతారు. కొందరు పళ్లు పూలు తీసుకువస్తారు. ఒక్కొక్కరు కర్పూరహారతి ఇచ్చివెళ్తారు. పదిపైసల బిళ్ళకు తక్కువ ఎవరూ అక్కడ పెట్టరు.

ఒక్కొక్కరోజు తీర్థప్రజను మరపిస్తారు భక్తులు.

ఉద్యోగినుల సంఖ్య ఇరవైదాటింది.

అంకమ్మకొడుకు పెద్దవాడు బి.ఏ ప్యాసయి ఆ సమీపంలో ఒకకొట్టు

అద్దెకు తీసుకుని చిన్న చిన్న వస్తువుల వ్యాపారం ప్రారంభించాడు. రెండోవాడు టీచరుగా పనిలో చేరాడు.

అంకమ్మ రాత్రి పడుకోబోయేటప్పుడు తనజీవితాన్ని సింహావలోకనం చేసిచూసుకుంటుంది. నారుపోసినవాడు నీరుపోస్తాడన్నట్లే ఆ రాళ్ల దేవుళ్ళయి తన పిల్లలనూ తననూ కాపాడుతున్నాయని నమ్ముతుంది.

భక్తులు యథాశక్తితో గుడికి అలంకారాలు చేస్తూ ఉంటారు ఆమెకు సంభావనలు సమర్పించుకుంటూ ఉంటారు.

ఇదీ పంచలింగాల గుడి చరిత్ర- స్థలపురాణము.